సాక్షి
వికారాబాద్

సోమవారం । 1 । జనవరి । 2024



వా'కింగ్'

నడకతో మానసిక ఒత్తిడిని జయించడం తోపాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని నిపుణులు అంటున్నారు. 8లో▸



బాబోయ్.. చలి

పది రోజులుగా చలి తీవ్రత పెరిగింది. దీంతో జనం గజగజ వణికిపోతున్నారు. వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. 8లో▸



ఆదరణ కరువు

ఆయుర్వేద వైద్యానికి ఆదరణ తగ్గుతోంది. దీర్ఘకాల, స్వల్పకాల రోగాలు సైతం అల్లోపతి వైపే మొగ్గుచూపుతున్నారు. 9లో▸

సరి'కొత్త' ఆశలతో..

- ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో నూతన సంవత్సరంలోకి అడుగులు
- 2023కు వీడ్కోలు.. 2024కి ఘన స్వాగతం
- ఆలయాల్లో పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

వికారాబాద్: కొత్త సంవత్సరాన్ని సరికొత్తగా ప్రారంభించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. 2023కు ఘనంగా వీడ్కోలు పలికిన ప్రజలు అంతే ఘనంగా కొత్త ఏడాది 2024కి స్వాగతం పలికారు. జనవరి ఒకటిన ఆలయాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో అధికార మార్పు జరిగి కొత్త ఎమ్మెల్యేలు కొలువుదీరారు. నలుగురిలో ఒకరు సీఎం పీఠాన్ని అధిష్ఠించగా, మరొకరు సభాపతి అయ్యారు. దీంతో జిల్లా వాసులు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలవుతాయని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి జిల్లాలోని పలు పట్టణాల్లో యువకులు రోడ్లపైకి చేరి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. రాత్రి 12గంటలు కాగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు. పలు చోట్ల బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. సెల్ ఫోన్లలో తమ మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల నేపథ్యంలో కేక్‌లకు డిమాండ్ పెరిగింది. మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. సాయంత్రం నుంచే వైన్‌షాపులు జనంతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు.

ఆలయాల వద్ద ఏర్పాట్లు

నూతన సంవత్సరం మొదటి రోజు ఆలయాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయం, బుగ్గ రామేశ్వర, పీరంపల్లి పరమేశ్వర గుట్ట, పూడూరు మండలం దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయం, కుల్కచర్ల మండలం పాంబండ ఆలయం, దోమలోని మైలారం వేంకటేశ్వర స్వామి ఆలయం, పరిగి, కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు, తాండూరు పరిధిలోని భూకైలాస్, నీల్లపల్లి శివాలయం, నవాబుపేట మండలం ఎల్లకొండ శివాలయాల్లో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 2024లో పలు అభివృద్ధి పనులు చేపట్టగా అవి చివరి దశలో ఉన్నాయి. వాటిని కొత్త సంవత్సరంలో ప్రారంభించే అవకాశం ఉంది. అలాగే కొత్త ఏడాదిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్ అప్పా జంక్షన్ నుంచి పూడూరు మండలం మన్నెగూడ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో పనులు ప్రారంభం కానున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి పనులు కొత్త ఏడాదిలో ప్రారంభం కానున్నాయి.



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న జనం

ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరేలా..



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చే దిశగా ముందుకు సాగుతాం. ఆరు గ్యారంటీలు అర్హులకు చేరేలా సమర్థవంతంగా పని చేస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనాపరంగా, ప్రభుత్వ పరంగా సేవలందిస్తాం. విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు సాధిస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు..



జిల్లా ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు. ఈ ఏడాది ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు సాగుతాం. చట్టాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం. గత ఏడాది అవగాహన కార్యక్రమాలు, ప్రజలు సహకారంతో నేరాల సంఖ్యను తగ్గించాం. కొత్త ఏడాదిలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి నేరాల నియంత్రణకు కృషి చేస్తాం. పోలీసుల పరంగా ప్రజలకు ఏయే అవసరాలు ఉంటాయో వాటిని నెరవేరుస్తాం

– కోటిరెడ్డి, ఎస్పీ

న్యూస్‌రీల్

ముస్లింల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముస్లింలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పాత తాండూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడు కమాల్ అతర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ శుభపరిణామం

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు రమేశ్‌బాబు



రమేశ్‌బాబు

దోమ: త్వరలో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామం అని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా మెంబర్ రమేశ్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలా మంది నిరుద్యోగులు డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ఖాళీగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించడం నిరుద్యోగుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

నేషనల్ ట్రెక్కింగ్ క్యాంప్‌లో షాద్‌నగర్ విద్యార్థులు

షాద్‌నగర్: జాతీయస్థాయి ట్రెక్కింగ్ శిక్షణ శిబిరంలో షాద్‌నగర్ విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌లోని నర్కండలో ఆదివారం ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నవీన్, ప్రకాశ్, బద్రు, సావిత్రి, నవీన్‌కుమార్, రాఘవేందర్, ఆంజనేయులు, దివ్య వాణి ట్రెక్కింగ్ క్యాంప్‌లో పాల్గొన్నారు.

భక్తిభావం అలవర్చుకోవాలి



మోమిన్‌పేట: మల్లికార్జున స్వామి సన్నిధిలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: మండలంలోని చక్రంపల్లిలో ఆదివారం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు. జాతరలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఐక్యత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

అనంతగిరి: వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామంలో కొలువుదీరిన గ్రామ దేవతల జాతర ఆదివారం ఘనంగా జరిగింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం స్థానికులు ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, మాజీ జెడ్పీటీసీ మైపాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురూజీ అనిల్ కుమార్‌జోషికి మహర్షి వేదవ్యాస్ అవార్డు



గురూజీ అనిల్‌కుమార్‌జోషికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి శ్రీనిఖిల్ చేతనా కేంద్రం నిర్వాహకుడు బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి 'మహర్షి వేద వ్యాస్, వేద పురుష్' అవార్డు అందుకున్నారు. మహర్షి వేద వ్యాస్ ఇంటర్‌నేషనల్ వర్చువల్ వేద యూనివర్సిటీ, వేదిక వర్చువల్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో తాంత్రిక్ సైన్స్ టెక్నాలజీ విభాగం కింద డిసెంబర్ 20 నుంచి 22వ వరకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ప్రపంచ వ్యాప్త కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ప్రపంచ వ్యాప్తంగా వేద, తంత్ర, మంత్ర విజ్ఞాన నిపుణులకు సన్మానంతో పాటు అవార్డులు అందజేశారు. కాగా ఆయా తేదీల్లో గురూజీ అనిల్‌కుమార్‌జోషి అక్కడికి వెళ్లలేకపోయారు. దీంతో నిర్వాహకులు డాక్టర్ చక్రదర్, డాక్టర్ సాగిరాజు వెంకటరాజు ఆదివారం సాయంత్రం శ్రీనిఖిల్ చేతనా కేంద్రానికి చేరుకొని గురూజీకి అవార్డు అందించడంతో పాటు సన్మానం చేశారు. అనంతరం ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు.

సాయి పీఠాన్ని సందర్శించండి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి ప్రశాంతిహిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠాన్ని సందర్శించాలని పీఠాధిపతి శ్రీ గోపాలకృష్ణానంద స్వామిజీ గవర్నర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి సత్కరించి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ఆహ్వానానికి గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్వామీజీ వెంట బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి, పార్టీ కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, స్వామిజీ కుమారుడు లలిత్ సాయికుమార్ ఉన్నారు.

ముగిసిన ధ్యాన సంబురం

- 11 రోజుల పాటు సాగిన పత్రీజీ ధ్యాన మహాయాగాలు
- డిసెంబర్‌లో పత్రీజీ మహిళా ధ్యాన వేడుకలు

కడ్తాల్: మండల పరిధిలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ క్షేత్రంలో పదకొండు రోజులుగా సాగిన పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు ఆదివారంతో ముగిసాయి. ఉదయం సామూహిక ధ్యానం అనంతరం ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి, పరిణిత పత్రి తదితరులు ధ్యాన సందేశమిచ్చారు. ధ్యాన సంబురాలను విజయవంతం చేసిన ప్రతీ పిరమిడ్ మాస్టరుకు, ధ్యానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ వ్యక్తి జ్ఞానయోగి కావాలన్నదే పత్రీజీ సంకల్పమని వివరించారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ధ్యానులు పిరమిడ్ 18 ఆదర్శ సూత్రాలు పాటించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిసెంబర్‌లో పత్రీజీ మహిళా ధ్యాన వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం ధ్యానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల ముగింపు సందర్భంగా పిరమిడ్ ట్రస్ట్ సభ్యులను, ధ్యాన గురువులను, మాస్టర్లను, సంగీత విద్వాంసులను, ట్రస్ట్ చైర్మన్, సభ్యులతో పాటు, పరిమళ పత్రి, పరిణత పత్రి ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ధ్యాన గురుమాత స్వర్ణమాల పత్రి, పీఎంసీ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, సభ్యులు దామోదర్‌రెడ్డి, సాంబశివరావు, బాలకృష్ణ, నవకాంత్, భారతి, కేశవరాజు, మాధవి, శివప్రసాద్, కిషన్‌రెడ్డి, శ్రీరాం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నేడు సందర్శనకు రాష్ట్రపతి నిలయం

రసూల్‌పురా: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంటుందని పరిపాలన అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26 నుంచే రాష్ట్రపతి నిలయం సందర్శనకు ప్రజలను అనుమతి ఇస్తున్నామని తెలిపారు. ఆసక్తి గలవారు సందర్శించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

మహనీయులారా మన్నించండి!


శిలాఫలకాలు లేని మహాత్ముల విగ్రహాలు

బొంరాస్‌పేట: ఏండ్లు గడుస్తున్నా మహనీయులకు మండల కార్యాలయ సముదాయం వద్ద గౌరవం దక్కడం లేదు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేడ్కర్, తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు నామకరణం తెలిపే శిలాఫలకాలు కరువయ్యాయి. 2015 జూలై 22న విద్యావంతుల వేదిక, మండల అధికారులు, ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించి, చిన్నపాటి రాజకీయ గొడవలతో శిలాఫలకాలు ఏర్పాటు చేయలేదు. మహనీయులారా మన్నించండి.. సీఎం గారు శిలాఫలకాలు ఏర్పాటు చేయండి' అంటూ మండల కేంద్రానికి వచ్చిన జనం వేడుకుంటున్నారు.

వేగం పెంచండి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: రాకంచర్ల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆలయ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే జాతరకు గర్భగుడిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించి వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, గోపాల్, పరశురాం, రఘురాంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యక్రమాలకు హాజరైన స్పీకర్


వేడుకల్లో పాల్గొన్న ప్రసాద్‌కుమార్, నాయకులు

ధారూరు: మండల పరిధిలోని కొండాపూర్ ఖుర్దు, కేరెళ్లి, ధారూరు గ్రామాల్లో జరిగిన పలు శుభ కార్యక్రమాల్లో ఆదివారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. కేరెళ్లిలో కొత్తపల్లి వెంకట్‌రాంరెడ్డి కుమార్తె శారీ ఫంక్షన్‌లో, కొండాపూర్‌ఖుర్దులో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మనవడి తొట్టిల కార్యక్రమంలో ధారూరులో సురేశ్ కుమార్తె వివాహానికి స్పీకర్ హాజరయ్యారు. స్పీకర్ వెంట ధారూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి,అంజయ్య ఉన్నారు.


ప్రాజెక్టు, అడవి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు


బోటింగ్ వద్ద ఫొటోకు ఫోజులిస్తున్న యువతులు

బోటింగ్ అదరహో

సందడి చేసిన పర్యాటకులు

కోటిపల్లి ప్రాజెక్టు అందాలను చూస్తూ సందర్శకులు సందడి చేశారు. శనివారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాజెక్టులో బోటింగ్‌ను పునఃప్రారంభించడంతో షికారు చేస్తూ ఆదివారం పర్యాటకులు ఎంజాయ్ చేశారు. ప్రాజెక్టు సమీపంలోని అడవి అందాలను తిలకిస్తూ సేదతీరారు. – ధారూరు

కళలను ప్రోత్సహించడం 'సంస్కార భారతి లక్ష్యం'

సంస్థ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్‌రావు

అనంతగిరి: అంతరించిపోతున్న కళలు, కళాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడం సంస్కార భారతి లక్ష్యమని ఆ సంస్థ తెలంగాణ ప్రాంత కార్యదర్శి వేణు గోపాల్‌రావు అన్నారు. ఆదివారం సంస్కార భారతి ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో తబలా కళాకారుల సమ్మేళనాన్ని సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తబలా కళాకారులకు మెలుకువలు నేర్పించారు. ఈ సందర్భంగా వేణు గోపాల్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది అనేక రంగాల్లో నైపుణ్యం సాధించారని, అలాంటి వారిని గుర్తించి గౌరవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 90 మంది తబలా కళాకారులు పాల్గొన్నారు.

బాబోయ్.. చలి


పొలాల వద్ద చలిమంట వేసుకున్న రైతులు

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- వణికిపోతున్న ప్రజలు

పెద్దేముల్: పది రోజులుగా చలి చంపేస్తోంది. చలిగాలులకు జనం గజగజ వణికిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక మండలాల్లో ఉష్ణోగ్రతలు పది డిగ్రీల లోపు పడిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గిపోయాయి. చలిగాలుల తీవ్రతకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాత్రి వేళల్లో బయట తిరిగేందుకు భయపడుతున్నారు. అలాగే చలికాలంలో ప్రయాణాలంటనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచుతో రోడ్లన్నీ నిండిపోతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పంట పొలాల వద్ద చలి మంటలు వేసుకొని రైతులు పనులు చేసుకుంటున్నారు.

ఆవు మృతి.. కేసు నమోదు

పూడూరు: అనుమానాస్పదంగా ఆవు మృతి చెందిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కిష్టం గోపాల్ ఈస్టు గూడెం హనుమాన్ ఆలయ సమీపంలో షెడ్డును నిర్మించుకొని ఆవులు, ఎద్దులను పెంచుతున్నాడు. ఈ నెల 30న గ్రామానికి చెందిన కంతల భీమయ్య, కిష్టం శ్రీశైలం, కిష్టం నరేశ్, తుంపల్లి రాఘవేందర్, నాళ్లపురం లక్ష్మయ్య జేసీబీతో పశువుల షెడ్డును కూల్చేశారు. అయితే అదే రోజు రాత్రి ఆవు మృతి చెందిందని, షెడ్డును కూల్చిన వారిపై అనుమానంతో గోపాల్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు



స్వాధీనం చేసుకున్న వస్తువులు

రాజస్తాన్ నుంచి నగరానికి తరలిస్తుండగా పట్టివేత

మీర్‌పేట: రాజస్తాన్ నుంచి నగరానికి మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఓటీ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉమేష్ తివారీ(35) సనత్‌నగర్‌లో నివాసముంటూ స్టీల్ రెయిలింగ్ పనిచేస్తుండగా, ఇదే పనిచేసే రాజస్తాన్‌కు చెందిన సురేష్ దేవాసి(26)తో కలిసి డ్రగ్స్‌ను కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. రాజస్తాన్‌కు చెందిన మరోవ్యక్తి రావ్లా రామ్(22) కూకట్‌పల్లిలో ఉంటు డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తుంటాడు. ముగ్గురు కలిసి నగరంలో విక్రయించేందుకు హెరాయిన్‌ని నగరానికి తీసుకొస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ బృందం రాత్రి ఆర్ఎన్‌రెడ్డినగర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 గ్రాముల హెరాయిన్, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్ర వాహనం రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకుని మీర్‌పేట పోలీసులకు అప్పగించారు. శనివారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

వా 'కింగ్'


వాకింగ్ చేస్తున్న వాకర్స్

ఉరుకుల పరుగుల జీవితం. కాలంతో పాటు పోటీ పడి సాగే జీవనం. ఆధునిక యుగం మనిషి నడత మారుతోంది. తెల్లవారకముందు రోడ్లు, మైదానాలు సందడిగా మారుతున్నాయి. పల్లె, పట్టణమనే తేడా లేకుండా వాకింగ్‌లో దర్శనమిస్తున్నారు. ఎముకలు కొరికే చలిలోనూ, కమ్ముకున్న పొగమంచులోనూ ఉత్సాహంగా నడుస్తున్నారు. మరుతున్న కాలంతో పాటు మనిషి జీవనశైలిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

- అరగంట నడిస్తే అలసట దూరం
- వాకింగ్‌తో రోగాలకు చెక్
- పట్టణాలు, పల్లెల్లో పెరుగుతున్న ఆసక్తి
- కాలంతో పాటు మారుతున్న జీవనశైలి

వికారాబాద్ అర్బన్: ఒత్తిడి, మానసిన శ్రేయస్సును మెరుగుపర్చుకోవడానికి సులభమైన సమర్థవంతమైన మార్గం నడక. నడక నవజీవనాన్ని కలిగిస్తుంది. రోజుకు అరగంట వాకింగ్ చేస్తే 24 రోగాలకు చెక్ పెట్టవచ్చని అనేక అధ్యయనాలు తేల్చాయి. నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నట్లే మనిషి జీవన విధానంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి వరకు ఈ పోటీ ప్రపంచంలో ఎదురీదే ఎందరో వ్యాయామం, వాకింగ్‌ను మర్చిపోతున్నారు. పని ఒత్తిడిలో పడి సమయానికి భోజనం చేయక రోగాల బారిన పడుతున్నారు. వ్యాపారం, ఉద్యోగం అంటూ కుటుంబాలకు కూడా సమయం ఇవ్వని ఎందరో అకస్మాత్తుగా వచ్చే రోగాలతో కుంగిపోవాల్సి వస్తుంది. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా.. ప్రతి రోజు అరగంట వాకింగ్ చేస్తే రోజురోజుకు కొత్త జీవితాన్ని పొందవచ్చని వైద్యులు అంటున్నారు.

వాకింగ్‌పై ఆసక్తి

ఇటీవల చలి బాగా పెరగడంతో వికారాబాద్ పట్టణంలో వాకింగ్, జాగింగ్ చేసే వారి సంఖ్య పెరిగింది. వాకింగ్‌లో కేవలం వృద్ధులే కాదు. యువకులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్, ఎస్ఏపీ కళాశాల మైదానంలో రోజుకు వందల సంఖ్యలో వాకింగ్ చేస్తుంటారు. పట్టణానికి అనంతగిరి కొండలు దగ్గరగా ఉండటంతో చాలా మంది తెల్లవారుజామునే చల్లటి గాలుల మధ్య వాకింగ్ చేస్తుంటారు.

వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు

రకరకాల వ్యాధులతో బాధపడే వాళ్లు రోజు వాకింగ్ చేయడంతో వారిలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని వైద్యులు అంటున్నారు. ప్రధానంగా మధుమేహం, అధిక రక్తపోటు వంటి రోగాలు అదుపులో ఉండాలంటే తప్పకుండా వాకింగ్ చేయాలని సలహాలు ఇస్తున్నారు. క్రమం తప్పకుండా నడవడం వలన రక్త ప్రసరణ కావడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారని చెబుతున్నారు.

మెలుకువలు తప్పనిసరి

వ్యాయామం చేసేవాళ్లు శిక్షకులతో సలహాలు సూచనలు తీసుకోవడం ఎంతో మేలు. జాగింగ్ ఇష్టానుసారంగా చేస్తే పలు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. మెలకువలు పాటించకుంటే మెడ, బుజం, వెన్ను నొప్పి వచ్చే అవకాశం ఉంది. ఈ మధ్యకాలంలో చాలా మంది కాళ్లకు షూ, చెప్పులు వేసుకోకుండా వాకింగ్ చేస్తున్నారు. ఇలా చేయడంతో రక్తపోటు తగ్గుతుందని, రక్త ప్రసరణ బాగా జరుగుతుందని ఒకరికొకరు చెప్పుకుంటారు. ఈ విషయంలో డాక్టర్ల సలహాలు తీసుకొని పాటిస్తే మంచిదని అంటున్నారు.

గ్రామాల్లో కూడా..

వాకింగ్, జాగింగ్, వ్యాయామం అనేది గతంలో పట్టణాలకు మాత్రమే పరిమితం. ఉద్యోగాలు చేసే వాళ్లంతా ఉదయం పూట వాకింగ్ చేయడం ఓ అలవాటు. గ్రామాల్లో ఉండే ప్రజలు వ్యవసాయ పొలాల్లో పనిచేయడంతో ఈ విషయాలపై పెద్దగా అవగాహన ఉండేది కాదు. గతంలో గ్రామీణ ప్రజలకు షుగర్, బీపీ వంటి రోగాలు కూడా తెలియవు. ఇప్పుడు ఈ రకమైన రోగాలు వీరిని కూడా చుట్టేశాయి. దీంతో ఆరోగ్య రక్షణకు వాకింగ్, జాగింగ్ చేస్తున్నారు. గ్రామీణ యువత కూడా ఈ చలికాలంలో ఎక్కువగా పరిగెడుతున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన సురేశ్ అతని తండ్రి వెంకటయ్యతో కలిసి నంచర్ల గ్రామం నుంచి ఐనాపూర్ గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. అయితే కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి తండ్రీకొడుకులు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో సురేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

విద్యావంతులను ప్రోత్సహించాలి

'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆధునిక యుగంలో విద్యవంతులను ప్రోత్సహించాలని పీవీ రాంరెడ్డి పీజీ కళాశాల సెక్రెటరీ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డెన్ సెలబ్రేషన్స్‌లో భాగంగా జాతీయ స్థాయిలో మెగా సెమినార్‌ను 'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్ మెంట్ ఎడ్యుకేషన్' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. దీనికి కళాశాల కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో విద్య ఎంతో అవసరమన్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో జరిగే మార్పుల గురించి వివరించారు. విద్యార్థులు దానికి తగ్గట్టుగా నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్, మహేష్, హరిత, శృతి, రమేష్, శ్రీదేవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. యువకుడు మృతి


మొబిన్ (ఫైల్)


ఆస్పత్రిలో మృతుడి బంధువుల ఆందోళన

యాలాల: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాజీవ్‌కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన మొబిన్ (25) ఎలక్ట్రీషియన్ పనిచేసేవాడు. ఆదివారం రాత్రి రాజీవ్‌కాలనీ నుంచి పట్టణానికి వస్తుండగా లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొబిన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రుడు మృతి చెందాడంటూ ఆస్పత్రికి తరలించకుండా మానవత్వం లేకుండా వదిలివెళ్లారని ఆరోపిస్తూ.. కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల పోలీసులు తెలిపారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

అత్తాపూర్: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చందానగర్ పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ గంగాధర్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ మధు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి సంబంధిత అధికారులతో కలిసి ఎక్కడికక్కడ చర్యలు చేపట్టారు. నూతన సంవత్సర వేడుకల్లో యువత అర్ధరాత్రి తరువాత రోడ్లపై తిరగకుండా ముందస్తుగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

9 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఇద్దరు వ్యక్తుల నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీబీఎస్ క్రాస్ రోడ్స్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపైన అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గమనించి అదుపులోకి తీసుకున్నట్లు సికింద్రాబాద్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన మానుష్ బిశ్వాస్, బలరాం మండల్ అనే ఇద్దరిని విచారించగా బైక్ సీట్ కింద 9 కిలోల గంజాయి ప్యాకెట్‌లు లభించాయి. వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కేక్‌లకు భలే గిరాకీ


కొత్త సంవత్సరానికి తయారు చేసిన కేక్

వికారాబాద్ అర్బన్: 2024 కొత్త సంవత్సరం సందర్భంగా పట్టణంలోని పలు బేకరీల్లో కేక్‌లకు గిరాకీ ఏర్పడింది. కేక్‌లకు ముందస్తు ఆర్డర్లు ఇచ్చిన యువకులు ఆదివారం సాయంత్రం తీసుకెళ్లారు. దీంతో బేకరీలు, స్వీట్ షాపుల్లో జనాల సందడి నెలకొంది. నూతన సంవత్సరం కోసం బేకరీల్లో ప్రత్యేకంగా కేక్‌లు తయారు చేశారు. కొత్త సంవత్సరం వేడుకలకు యువత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసుకున్నారు. న్యూ ఇయర్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు వీధుల్లో సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసుకున్నారు.

బెల్ట్‌షాప్‌లపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

శంకర్‌పల్లి: మండల పరిధిలోని సంకేపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు గ్రామంలోని చంద్రశేఖర్, రామచంద్రయ్య దుకాణాలపై దాడులు చేసి 135 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

యువకుడి హత్య

శంషాబాద్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడుని హత్య చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన మల్లేష్ (28)కొంత కాలంగా శంషాబాద్ పరిసరాల్లో కూలీ పని చేసుకుంటూ నివాసముంటున్నాడు. మండలంలోని ఘాంసిమిగూడ సమీపంలో బెంగళూరు జాతీయ రహదారి పక్కన హత్యకు గురయ్యాడు. ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. మృతుడి వద్ద దొరికిన ఆధారాలతో అతని వివరాలు సేకరించారు. మృతుడి ఒంటిపై గాయాలుండడంతో అతన్ని హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

నూతనోత్సాహం.. బాలాజీ దర్శనం

నూతన సంవత్సర వేళ ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. అందులోనూ వీసా దేవునిగా ప్రసిద్ధి చెందిన చిలుకూరు శ్రీ బాలాజీ దర్శనానికి అధిక సంఖ్యలో రానున్నారు. పాత సంవత్సర జ్ఞాపకాలను నెమరేసుకుంటూ, కొత్త ఆశలు, ఆశయాలతో రానున్న భక్తులకు ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మొయినాబాద్: నూతన సంవత్సరం మొదటి రోజు సందర్భంగా సోమవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. ఏటా జనవరి 1న చిలుకూరు బాలాజీని దర్శించుకునేందుకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది సైతం అదే స్థాయిలో భక్తులు బాలాజీ దర్శనానికి వచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ పూజారులు, గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ తగిన ఏర్పాటు చేశారు. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులు సైతం రెండు కిలోమీటర్ల దూరం నుంచే వెనక్కి వెళ్లే విధంగా సూచించారు. అక్కడి నుంచే భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఆలయ ప్రాంగణంతోపాటు బయట కూడా భక్తుల క్యూలైన్ల కోసం ఏర్పాటు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. భక్తులందరికీ మహాద్వార దర్శనం ఏర్పాటుచేశారు. తెల్లవారు జాము 4 గంటలకే ఆలయాన్ని తెరిచి స్వామివారి దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

చిలుకూరు బాలాజీ దేవాలయానికి సోమవారం భారీ సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఆలయ అర్చకుడు రంగరాజన్, ఇన్‌చార్జి సీవి యాదయ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరికి తోడుగా సుమారు వంద మందికిపైగా వాలంటీర్లను అందుబాటులో ఉంచారు.







